RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 165 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం బుధవారం, 18 డిసెంబర్ 2024 పేజీలు : 4 వెల : 2/-

# లోక్‌సభ ముందుకు... 'జమిలి ఎన్నికల' బిల్లు




దిల్లీ: లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకొచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా, మరో బిల్లును కేంద్రం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. అయితే, ఈ బిల్లులను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఈ బిల్లులను దిగువసభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై సభలో చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ సహా పలు విపక్ష పార్టీల ఎంపీలు దీన్ని వ్యతిరేకిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు, ఎన్డీయే మిత్రపక్షమైన తెదేపా ఈ బిల్లుకు భేషరతుగా మద్దతు తెలిపింది. ఈమేరకు ఆ పార్టీకి చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సభకు తెలియజేశారు.

**రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే..** చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ.. "జమిలి బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. దీన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి" అని అన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఈ బిల్లుతో బిడ్ వేస్తున్నారని ఎస్పీ నేత ధర్మేంద్రయాదవ్ దుయ్యబట్టారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని ఆరోపించారు. అనంతరం టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. ఇది ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటిది. ప్రస్తుతం మనకు కావాల్సింది జమిలి ఎన్నికలు కాదు.. ఎన్నికల సంస్కరణలు. గతంలో ఎన్‌జేఏసీ (నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్) బిల్లును కూడా ఇలాగే చర్చ లేకుండా ఆమోదించుకున్నారు. ఆ తర్వాత మౌలిక స్వరూపానికి ఎన్‌జేఏసీ విరుద్ధమని సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. జమిలి ఎన్నికల చట్టం వస్తే దానికీ అదే పరిస్థితి ఎదురవుతుంది" అని మండిపడ్డారు.

**జమిలికి అనుకూలంగా 269 ఓట్లు.. జేపీసీకి వెళ్లనున్న బిల్లులు** : గత కొన్నేళ్లుగా చర్చనీయాంశమవుతున్న జమిలి ఎన్నికల బిల్లు ఎట్టకేలకు పార్లమెంటులోకి వచ్చింది. ఇందుకోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు-2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు-2024ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మంగళవారం లోక్సభలో ప్రవేశపెట్టారు. అయితే ఈ రెండు బిల్లులకు 269 మంది ఎంపీలు అనుకూలంగా ఓటు వేశారు. మరో 198 మంది ఎంపీలు ఈ బిల్లులకు వ్యతిరేకంగా ఓటేశారు. కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారిగా ఎలక్ట్రానిక్ విధానంలో ఈ ఓటింగ్ జరిగింది. ఈ రెండు బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు. అయితే ఈ బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు అధికార, విపక్ష ఎంపీల మధ్య వాగ్వాదం జరిగింది. కాంగ్రెస్, సమాజ్వాదీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీల ఎంపీలు ఈ బిల్లులను వ్యతిరేకించారు. దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అనేది ప్రజాస్వామ్య మౌలిక వ్యవస్థపై దాడి చేయడమేనని కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారి అన్నారు. ఈ బిల్లులను ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికల అనేవి దేశంలో నియంతృత్వ పాలన వైపు నడిపేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నమని సమాజ్వాదీ పార్టీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. విపక్ష నేతల విమర్శలపై కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ స్పందించారు. జమిలి ఎన్నికల అంశం కొత్తదేమి కాదని.. 1983 నుంచే ఈ ఎన్నికలు జరపాలనే డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ స్వరూపానికి, రాష్ట్ర హక్కులకు, సమాఖ్య స్ఫూర్తికి భంగం కాదని స్పష్టం చేశారు. జర్మనీ, స్వీడన్ లాంటి దేశాల్లో కూడా ఇలాంటి జమిలి ఎన్నికలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. 2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలని కేంద్రం యోచిస్తోంది. లోక్సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతానికి స్థానిక సంస్థల ఎన్నికల అంశాన్ని కేంద్రం పక్కన పెట్టింది. అయితే 2034 నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు కూడా జమిలి పరిధిలోకి రానున్నాయని అధికారక వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు జమిలి ఎన్నికలకు ఉన్న అడ్డంకులను కూడా కేంద్రం పరిశీలిస్తోంది. ఇతర రాజకీయ పార్టీలను ఒప్పించి.. రాజ్యంగ సవరణలు జరిగేలా చూడడంపై కేంద్రం ఫోకస్ పెట్టింది. అలాగే జనాభా లెక్కల సేకరణ, నియోజకవర్గాల పునర్విభజనను కూడా 2029లోపు పూర్తి చేయాలని మోదీ సర్కార్ భావిస్తోంది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది(2025)లో జనాభా లెక్కల సేకరణ, 2027 నాటికి నియోజకవర్గాల పునర్విభజన, అలాగే మహిళ రిజర్వేషన్ బిల్లును అమలు చేసే ప్రక్రియను పూర్తిచేయాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.




భాజపాలో సంస్థాగత మార్పులు చోటు చేసుకోబోతున్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పార్టీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశముంది. ప్రస్తుతం దాదాపు 60శాతం భాజపా రాష్ట్ర అధ్యక్షుల పదవీకాలాలు ముగిశాయి. వీటన్నింటికీ జనవరిలో ఎన్నికలు నిర్వహించి, ఆ తర్వాతి నెలలో జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు పార్టీ ముఖ్య నేతలు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. భాజపా పార్టీ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి.

**నడ్డా వారసుడెవరు? :** 2019లో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన వ్యూహాలతో పార్టీ ప్రతిష్ఠను మరింత ఎత్తుకు తీసుకెళ్ల గలిగారు. నడ్డా బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా సత్తా చాటింది. తాజాగా మూడోసారి అధికారం లోకిచ్చిన వచ్చిన కాషాయ పార్టీ.. నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొని, ఆరోగ్య శాఖ బాధ్యతలు అప్పగించింది. దీంతో పార్టీ అధ్యక్ష బాధ్యతలను సమర్థుడైన మరో నాయకుడికి అప్పగించే యోచనలో ఉంది. అయితే, నడ్డా వారసుడిగా ఎవరు ఉండాలన్న దానిపై పలువురి నేతల పేర్లు తెరమీదకు వస్తున్నాయి. తొలుత దేవేంద్ర ఫడణవీస్ పేరు వినిపించింది. అయితే, ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో విజయం సాధించిన కమలం పార్టీ.. ముఖ్యమంత్రి పదవిని ఫడణవీస్‌కు అప్పగించింది. దీంతో ఆయన జాతీయ అధ్యక్షుడి రేసు నుంచి వైదొలగినట్లయింది. ప్రముఖంగా వినిపిస్తున్న మరో పేరు.. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఒకవేళ ఆయనకు అధ్యక్ష పదవి ఇస్తే.. మంత్రివర్గం నుంచి తప్పించే అవకాశముంది. ఎందుకంటే పార్టీ రాజ్యాంగం ప్రకారం ఒకరికి రెండు పదవులు నిషిద్ధం. వీరితోపాటు రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెక్రెటరీ సునీల్ బన్సల్, మహారాష్ట్ర భాజపా అగ్రనేత వినోద్ తావడే పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. వీరిలోనే ఒకరిని ఎంపిక చేస్తారా? లేదంటే.. అనూహ్యంగా మరొకరిని తెరమీదకు తీసుకొస్తారా? అన్నదానిపై ప్రతిష్టంభన నెలకొంది. నిజానికి, పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలోపెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష ఎన్నికలు అనివార్యమయ్యాయి.



## తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు ఊరట

హైదరాబాద్: తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట లభించింది. ఇతర రాష్ట్రాల్లో చదివిన రాష్ట్ర విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు జీవో 140 సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.




# వేగం పుంజుకున్న 'ఇందిరమ్మ ఇండ్లు'

## స్కీమ్‌కు వేగంగా నిధులు సేకరిస్తున్న ప్రభుత్వం

## హడ్కో నుంచి ఇప్పటికే రూ.850 కోట్ల లోన్ సాంక్షన్

## ఈ నెలలో రాజీవ్ స్వగృహ వేలం

## రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్ ను పక్కా ప్లాన్?తో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా నిధులు సమీకరించే పనిలో ప్రభుత్వం నిమగ్నమయింది. ఇప్పటికే వీకర్ సెక్షన్ హౌసింగ్ ప్రోగ్రాంలో భాగంగా హడ్కో రూ.850 కోట్లను ఈ ఏడాది ఏప్రిల్ లో విడుదల చేసింది. ఇపుడు రాజీవ్ స్వగృహ ల్యాండ్స్, టవర్లు, అపార్ట్ మెంట్లకు ప్రభుత్వం ఈనెలలో వేలంపాట నిర్వహించనుంది. వీటి ద్వారా రూ.700 కోట్లు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల హౌసింగ్ బోర్డు భూములను లీజుకు తీసుకొని అమౌంట్ కట్టని వారి అగ్రిమెంట్ల ను రద్దుచేశారు. రెండు కంపెనీల నుంచి సుమారు రూ.350 కోట్లు వసూలు కావాల్సి ఉంది. . దీంతోపాటు గత ఏడాది పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అందజేసింది. వీటి వివరాలను కేంద్రానికి పంపగా దశలవారీగా పీఎం ఆవాస్ యోజన నుంచి ఫండ్స్ రిలీజ్ చేస్తోందని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రజాపాలనలో వచ్చిన అప్లికేషన్లను హౌసింగ్, పంచాయతీ అధికారులు.. గ్రామాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పరిశీలిస్తున్నారు. ఈ పక్రియ ఈ నెలాఖరు వరకు పూర్తికానున్నట్లు తెలుస్తోంది. అనంతరం లబ్ధిదారుల లిస్ట్ ను ఖరారుచేసి గ్రామసభలో ఆమోదించి, జిల్లా లేదా ఇన్ చార్జి మంత్రుల ఆమోదంతో కలెక్టర్ ఆ లిస్టును ఫైనల్ చేస్తారు. తొలి దశలో సొంత జాగా ఉన్న వ్యసాయ భూమి లేని కూలీలు, వితంతువులు, వికలాంగులు, పేద వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

**ఈ నెలలోనే రాజీవ్ స్వగృహ వేలం...** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రాజీవ్ స్వగృహ అపార్ట్ మెంట్లు, జాగాలను వేలం వేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈనెలాఖరుకు వేలం వేసేందుకు అధికారులు రెడీ అయ్యారు. త్వరలో వేలానికి సంబంధించి నోటిఫికేషన్ ఇస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ వేలంలో రాష్ట్రంలో పలు జిల్లాలతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న ఖాళీ జాగాలు, పూర్తయిన టవర్లను వేలంలో అమ్మనున్నారు.

**ముందే కేంద్రానికి లబ్ధిదారుల లిస్ట్....** పీఎం ఆవాస్ యోజన స్కీమ్ కింద ఫండ్స్ రిలీజ్ చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం.. లబ్ధిదారుల లిస్టును ముందుగానే కేంద్రానికి పంపాలి. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ స్కీమ్ కు లబ్ధిదారులను ఎంపిక చేసి పీఎం ఆవాస్ యాప్ లో అప్ లోడ్ చేయనున్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల స్కీమ్ కు ఇళ్ల నిర్మాణం పూర్తయిన తరువాత లబ్ధిదారులకు పట్టాలు అందించారు. దీంతో తమ రూల్స్ కు అనుకూలంగా లేకపోవడంతో రూ.1100 కోట్ల విడుదలను కేంద్ర ప్రభుత్వం ఆపేసింది. ఫలితంగా నిధుల సమీకరణకు కష్టాలు ఎదురుకావడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇండ్ల నిర్మాణం నత్త నడకన కొనసాగింది. 8 ఏండ్లలో 2.70 లక్షల ఇళ్లు పూర్తి చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లు కూడా పూర్తి చేయలేదు.

పూర్తయిన ఇళ్లకు లబ్ధిదారులను కూడా ఎంపిక చేయలేదు. కాగా.. గత ఏడాది కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇండ్ల నిర్మాణానికి నిధులు రిలీజ్ చేస్తూ పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేసింది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## తెలుగు పాలిటిక్స్ 2024

## గెలిచినా వికసించని ఏపీ బీజేపీ!

ఏపీలో బీజేపీ పరిస్థితి ఏంటో కానీ సీట్లూ ఓట్లూ ఈసారి దండీగా వచ్చినా ఉనికి పోరాటమే చేస్తోంది. టీడీపీ కూటమిలో మూడవ పార్టీగా ఉన్నా కూడా పెద్దగా గుర్తింపు అయితే లేదు. నిన్నటికి నిన్న స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ రిలీజ్ లోనూ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురంధేశ్వరి కనిపించలేదు. ఈ డాక్యుమెంట్ మీద చంద్రబాబు పవన్ మాత్రమే సంతకాలు చేసి రిలీజ్ చేశారు. ఈ ఏడాదిలో బీజేపీకి ఏపీలో రాజకీయంగా మంచి రోజులే వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల వరకూ జనసేనతో పొత్తు ఉన్నా పెద్దగా పొలిటికల్ సీన్ లోనికి రాని బీజేపీ టీడీపీతో పొత్తు ప్రకటన రాగానే జోరు పుంజుకుంది. బీజేపీ సీట్ల కోసం పోటీ పెరిగింది. ఎందుకంటే పొత్తులు ఉంటే బీజేపీకి ఎపుడూ గెలుపు పిలుపు వినిపిస్తుంది. ఇది అనేకసార్లు జరిగింది. అది 2024 ఎన్నికల్లోనూ రుజువు అయింది. పది అసెంబ్లీ సీట్లకు బీజేపీ పోటీ చేస్తే ఎనిమిది సీట్లను గెలుచుకుంది. రాయలసీమ లాంటి చోట్ల కూడా కమలం జెండా ఎగిరింది. అంటే అసెంబ్లీ వరకూ చూస్తే ఎనభై శాతం సక్సెస్ రేటు కొట్టింది అన్న మాట. ఇక పార్లమెంట్ సీట్లు ఆరింటిని బీజేపీ తీసుకుని పోటీ చేస్తే అందులో మూడింటిని గెలిచింది. అంటే ఇది యాభై శాతం సక్సెస్ రేటు అన్న మాట. గెలిచిన తరువాత కేంద్రంలో ఒక సహాయ మంత్రి పదవి బీజేపీకి దక్కింది. అలాగే ఏపీ కేబినెట్ లో ఒక మంత్రి పదవి దక్కింది. అయితే ఏపీలో ఎక్కడ చూసినా టీడీపీ జనసేన హవాయే కనిపిస్తోంది తప్ప బీజేపీ ఊసు అయితే పెద్దగా లేదని అంటున్నారు. బీజేపీలో ఎందరో సీనియర్ నెతలు ఉన్నారు. ఇక ఎంపీలలో చూస్తే దగ్గుబాటి పురంధేశ్వరి, సీఎం రమేష్ వంటి వారు కనిపిస్తారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేగా సుజనా చౌదరి ఆదినారాయణరెడ్డి వంటి వారు ఉన్నారు.రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన విష్ణు కుమార్ రాజు లాంటి వారూ ఉన్నారు. ఇక బీజేపీ పెద్దలతో ఎంతో సాన్నిహిత్యం ఉన్న సత్యకుమార్ మంత్రిగా కూటమి ప్రభుత్వంలో ఉన్నారు. ఇలా బీజేపీకి మంచి లీడర్లు ఉన్నా కూడా ఏపీలో ఆ పార్టీ తనదైన రాజకీయ ముద్ర అయితే బలంగా వేయలేకపోతోంది అని అంటున్నారు. జనంలోకి ఎపుడూ టీడీపీ జనసేన మాత్రమే చర్చకు వస్తున్నాయి.అంతే కాదు నామినేటెడ్ పదవుల విషయంలోనూ బీజేపీని పెద్దగా పట్టించుకోవడం లేదు అన్న మాట ఉంది. నాలుగు ఎమ్మెల్యేలు ఉంటే ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చి 2014లో కేబినెట్ కూర్పు చేసిన చంద్రబాబు ఈసారి ఎనిమిది మంది గెలిస్తే ఒక్కరికే ఇచ్చారు. కీలక విషయాలలో చర్చించేందుకు పవన్ కళ్యాణ్ తోనే కలుపుకుని ముందుకు సాగుతున్నారు. సాధారణంగా అధికారంలో ఉన్నపుడే ఆయా పార్టీలు మరింత పటిష్టంగా మారతాయి. విస్తరించేందుకు మార్గాలు చూసుకుంటాయి. బీజేపీ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లుగానే ఉందని అంటున్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వానికి టీడీపీ ఎంపీలు అవసరం కావడంతో ఏపీ బీజేపీ కంటే టీడీపీకి ఎక్కువ విలువ ఇవ్వాల్సి వస్తోంది అని అంటున్నారు. అదే విధంగా క్రౌడ్ పుల్లర్ అని ఇమేజ్ ఉన్న నేత అని పవన్ కళ్యాణ్ కి ఎక్కువ ప్రాధాన్యతను బీజేపీ పెద్దలు ఇస్తున్నారు. దాంతో ఎక్కడా ఏపీ బీజేపీ నేతలు కనిపించడం లేదని అంటున్నారు. ఇదే విధంగా ఉంటే సీట్లు పెరిగినా పదవులు దక్కినా బీజేపీ జనంలో వికసించడం మాత్రం కలగానే మారుతుందని అంటున్నారు. ఏపీ బీజేపీ ఇలా కట్టిపడేసి నట్లుగా ఉండడం అయితే రానున్న కాలంలో రాజకీయంగా చూస్తే కనుక ఇబ్బందిగానే ఉంటుందని అంటున్నారు.

# లక్ష్యం చేరేలా.. లాభాలు సాధించేలా!



గోదావరిఖని: సింగరేణి భవిష్యత్తును మరింత పదిలం చేసుకునేందుకు యాజమాన్యం అడుగులు వేస్తోంది. తాజా పరిస్థితులు.. ఎదురవుతున్న సవాళ్లు అధిగమించేందుకు సమష్టి కృషి అవసరమన్న విషయాన్ని కార్మికులకు గుర్తుచేస్తోంది. ప్రస్తుత మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై వివరిస్తుంది. నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి ముఖ్యమని తెలియజేస్తోంది. వీటిపై మల్టీ డిపార్టుమెంట్ కమిటీల ద్వారా కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

**యంత్రాల పనిగంటలపై..**

మార్కెట్ పోటీని తట్టుకోవడానికి ఒప్పందం ప్రకారం వినియోగదారులకు బొగ్గు రవాణా చేయాలి. అందుకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించాలి. గనుల వారిగా కార్మికులు, ఉద్యోగులు సమష్టిగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఇదే విషయాన్ని కార్మికులకు గుర్తు చేస్తోంది.

ముఖ్యంగా భూగర్భ బొగ్గుగనుల్లో ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాలు కనీసం 18 గంటలు పనిచేయాలని యాజమాన్యం చెబుతోంది. ప్రస్తుతం 12 గంటలు మాత్రమే పనిచేస్తున్నాయి. దీని ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఉపరితల గనుల్లో కూడా యంత్రాల పని గంటలు పెంచుకోవాలని యాజమాన్యం అవగాహన కల్పిస్తుంది.

**పొదుపు ముఖ్యం**

సింగరేణిలో పొదుపు చర్యలు సంస్థ పురోభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయి. అనవసర వ్యయాలు తగ్గించుకోవడంతో ఉత్పత్తి వ్యయంపై భారం పడకుండా ఉంటుంది. ఉత్పాదకత పెరుగుతోంది. దీనిపై యాజమాన్యం ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తోంది. సంస్థ పురోగతికి వృథా ఖర్చులు కూడా కొంత ప్రతిబంధకంగా మారుతున్నాయి. యంత్రాలు, విడిభాగాలు అవసరం లేకున్నా కొనుగోలు చేయకూడదు. ఈ విషయాలను కూడా యాజమాన్యం సమీక్షించుకుంటుంది.

**నష్టాలు అధిగమిస్తేనే..**

సింగరేణికి గుదిబండగా మారుతున్న నష్టాలు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. భూగర్భ బొగ్గుగనుల్లో ఒక టన్ను ఉత్పత్తికి రూ.10 వేల వరకు వ్యయమవుతుంది. దీన్ని రూ.4 వేలకు మాత్రమే విక్రయించాల్సి వస్తుంది. అంటే ఒక టన్ను బొగ్గు ఉత్పత్తిపై కనీసం రూ.6వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఉపరితల గనులు, విద్యుత్తు కేంద్రాల ద్వారా వస్తున్న లాభాలు సగం భూగర్భ గనుల నష్టాల సవరణకే సరిపోతున్నాయి. లాభాలు లేకపోయిన నష్టాలు అధిగమించేందుకు కసరత్తు చేస్తే సంస్థ లాభాల బాట పట్టొచ్చు.

# ఆదా చేద్దాం.. భావితరాలకు అందిద్దాం



కరీంనగర్ : మన జీవనం అడుగడుగునా ఇంధనంతో ముడిపడి ఉంది. ఇంట్లో విద్యుత్తు, వంట గ్యాస్ లేకుంటే ఆహారం నోట్లోకి వెళ్లని పరిస్థితి. ఎక్కడికన్నా బయటకు వెళ్లాలన్నా వాహనం తప్పనిసరి. వీటన్నింటికి ఇంధనం ఉండాల్సిందే. ప్రకృతిలో ముడిసరకులు, సహజ వనరులు తగ్గిపోతుండటంతో రోజురోజుకు వీటి ధరలు పెరిగిపోతున్నాయి. మన భవిష్యత్తు తరాలకు ఇంధనం అందించాలన్నా.. కాలుష్యాన్ని తగ్గించాలన్నా ఇంధనాన్ని పొదుపుగా వాడాల్సి ఉంటుంది. కొద్దిపాటి మార్పులు, నిర్వహణ, జాగ్రత్తలు పాటిస్తే ఇంధనం ఆదా అవుతుంది. నేడు 'ఇంధన పరిరక్షణ దినోత్సవం' సందర్భంగా ఎలాంటి మెలకువలు పాటించాలో వివరిస్తూ కథనం.

**వంటగ్యాస్ ఇలా...** ఐఎస్ఐ మార్కు కలిగిన గ్యాస్ స్టౌనే వాడాలి. ғ వంట వండని సమయంలో రెగ్యులేటరు బంద్ చేయాలి.

వంట సామగ్రి సిద్ధం చేసుకున్న తర్వాతే గ్యాస్ స్టౌ వెలిగించాలి.

వేగంగా వంట చేయడానికి ఇంధనం ఆదా చేయడానికి ప్రెషర్ కుక్కర్ వాడాలి.

ఉడకడం మొదలైన తరువాత మంట తగ్గించాలి.

పప్పు, ధాన్యాలను వంటకు ముందు నానబెట్టాలి.

గ్యాస్ స్టౌపై చిన్న బర్నర్‌ను ఎక్కువగా ఉపయోగించాలి. చిన్న గిన్నకు పెద్ద బర్నర్ ఉపయోగించొద్దు. పైప్ లీకేజీ లేకుండా చూస్తా..

గ్యాస్ పైప్ లీకేజీ లేకుండా చూసుకుంటా. వంట అయిపోయాక రెగ్యులేటర్ బంద్ చేస్తాను. ఏ మాత్రం గ్యాస్ వాసన వచ్చిన వెంటనే పైప్ మార్చుతాం. వంట తయారీకి కావాల్సిన సామగ్రిని అందుబాటులో పెట్టుకొని స్టౌ వెలిగిస్తాను. వంటకు ముందు పప్పులు, బియ్యం నానబెడతాను.– తమ్మిశెట్టి భవాని, గృహిణి

**వాహనాల నిర్వహణ ప్రధానం..**

వాహనాలు నడపడమే కాదు. వాటి నిర్వహణ కూడా చూడాలి. కార్లు, ద్విచక్ర వాహనాలు నిర్ణీత సమయం, కిలోమీటర్లు (2000–2500) తిరిగిన తర్వాత తప్పనిసరిగా సర్వీసింగ్ చేయించాలి. ఇలా చేస్తే 5–10 శాతం ఇంధనం ఆదా అవుతుంది.వాహనాన్ని ఒకే రకమైన వేగంతో నడపాలి. స్పీడోమీటరులో ఆకుపచ్చని గుర్తు పరిధిలోనే వేగం ఉండేలా చూసుకోవాలి.

గేర్లు మార్చినపుడు మాత్రమే బైక్ క్లచ్ వాడాలి. అదే పనిగా క్లచ్ నొక్కిపడితే ఇంధనం ఖర్చు అవుతుంది. వాటి పరికరాలూ దెబ్బతింటాయి.

ట్రాఫిక్ సిగ్నళ్లు, పార్కింగ్ స్థలాల వద్ద నిమిషానికంటే ఎక్కువగా ఆగాల్సి వస్తే ఇంజిన్‌ను నిలిపివేయాలి.– టైర్లలో గాలి ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవాలి.

ద్విచక్ర వాహనంపై కవరు వేయించాలి. పెట్రోల్ ట్యాంక్ మూత సరిగా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే పెట్రోల్ ఆవిరి అయ్యే అవకాశముంది.

చిన్నపాటి దూరానికి వాహనం తీయకపోవడం మంచిది. నడిచి వెళ్తే.. ఇంధనం ఆదాతోపాటు ఆరోగ్యం లభిస్తుంది.

ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలి. పెట్రోలు కారు 10 వేల కిలోమీటర్లు తిరిగితే ఇంధనం, నిర్వహణ కలిపి రూ.50 వేల వరకు అవుతుంది. ఎలక్ట్రిక్ వాహనాలు అయితే రూ.15 వేల వరకు ఖర్చు అవుతుందని నిపుణులు చెప్పారు. బీఎస్–6 త్రీ–ఐ–టెక్నాలజీ వాహనాలు సిగ్నళ్ల వద్ద, ఇతర ప్రాంతాల్లో 15 సెకన్ల కంటే ఎక్కువ సేపు బండి నిలిపినప్పుడు దానంతట అదే ఆగిపోతుంది. తిరిగి క్లచ్ పట్టుకుంటే స్టార్ట్ అవుతుంది.

కండిషన్‌లో ఉంచుకుంటా.. నేను పదేళ్ల నుంచి ద్విచక్ర వాహనం నడుపుతున్నా. ప్రతి 2000 కిలోమీటర్లకు ఒకసారి సర్వీసింగ్ చేయిస్తా. వాహనం టైర్లలో గాలి సరైన మోతాదులో ఉండేలా చూసుకుంటా. నా వాహనం లీటరుకు 50 కిలోమీటర్లకు పైగా మైలేజీ ఇస్తుంది. వాహనం కండిషన్‌గా ఉంచుకుంటా.

– విక్రం నర్సింగారావు, ప్రైవేట్ ఉద్యోగి

**విద్యుత్తు వినియోగం..**

విద్యుత్తు ఇంధన పొదుపుపై బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషెన్సీ కొన్ని సూచనలు జారీ చేసింది.

అయిదు స్టార్ల ఉపకరణాలు వినియోగించాలి.

ఇన్వర్టర్ కలిగిన ఏసీలు కొనాలి. ఏసీ వినియోగించే సమయంలో కిటికీలు, తలుపులు మూసివేయాలి.

అవసరం లేనప్పుడు ఉపకరణాలు ఆఫ్ చేయాలి.

ఎల్ఈడీ బల్బుల వాడకంతో 80 శాతం కరెంటు ఆదా అవుతుంది.

వాషింగ్ మెషిన్‌లో చల్లని నీటిని ఉపయోగించాలి. ఫుల్ లోడ్‌తోనే వాడాలి. బయట ఎండ ఉన్నప్పుడు.. దుస్తులు ఆరబెట్టడానికి డ్రయర్ వినియోగించొద్దు.

ఇంట్లో ఫ్రిజ్ వేసవి, శీతకాలానికి అనుగుణంగా ఉష్ణోగ్రతలు మార్చుకోవాలి. తలుపులు పదేపదే తెరవద్దు.

వ్యవసాయ మోటార్లు, కెపాసిటర్లు, తదితర పరికరాలు ఐఎస్ఐ మార్కు ఉన్నవే ఉపయోగించాలి.

అవసరం మేరకు వాడుకుంటాంవిద్యుత్తు ఆదా చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది. మా ఇంట్లో ఎల్ఈడీ బల్బులు వినియోగిస్తాం. రాత్రి అన్ని గదుల్లో లైట్లు వేయకుండా, ఎక్కడ అవసరమో అక్కడివి మాత్రమే వేస్తాం. నిద్రించే సమయంలో కేవలం జీరో బల్బులను మాత్రమే వినియోగిస్తాం.– వస్తాదుల శ్రీనివాస్, కరీంనగర్


# వేతనాలకు ఎదురు చూపులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉన్న చోట ప్రభుత్వం అతిథి అధ్యాపకులను నియమించి విద్యా బోధన చేయిస్తోంది. కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తుండగా నెలనెలా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు నాలుగు నెలల వేతనాలు చెల్లించక పోవడంతో అవస్థలు తప్పడం లేదు.

**15 కళాశాలలు.. 52 మంది అతిథి అధ్యాపకులు**

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మొత్తం 15 ఉండగా ఇందులో రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ అధ్యాపక పోస్టులను ప్రభుత్వం భర్తీ చేపట్టకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అతిథి అధ్యాపకులను నియమించింది. జిల్లాలోని అన్ని కళాశాలల్లో మొత్తం 52 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక్కో తరగతికి రూ.390 చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది. ఒక్కో అతిథి అధ్యాపకుడు కళాశాల పనిరోజుల్లో రోజుకు నాలుగు తరగతుల చొప్పున విద్యా బోధన చేయాల్సి ఉంటుంది. సెలవు రోజులు మినహా విధులు నిర్వహించిన రోజులకే వేతనం వస్తుంది. ఒక్కో అతిథి అధ్యాపకుడికి సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల లోపు వేతనం వస్తుంది.

కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులను ఈ విద్యా సంవత్సరం రెన్యూవల్ చేశారు. వారికి గత విద్యా సంవత్సరంలోని కొన్ని నెలలు, ఈ విద్యా సంవత్సరంలోని జూన్, జులై నెలలకు




సంబంధించిన వేతనాలు విడుదల చేశారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించిన వేతనాలు రావాల్సి ఉంది. నిత్యం విధులు నిర్వహిస్తునప్పటికీ వేతనాలు నెలనెలా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, వేతన బకాయిలను త్వరగా విడుదల చేయాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు పంపించాం

జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులకు రావాల్సిన వేతనాల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపించాము. త్వరలోనే ప్రభుత్వం నిధులు కేటాయించనుంది. దీంతో నెల చివరిలోగా నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలు విడుదల కానున్నాయి.

– డా.కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

# ఆశల 'సాగు'రం

గరిడేపల్లి : నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆగస్టులో వచ్చిన వరదలకు ఎగువ జలాశయాలు నిండి దిగువకు భారీగా వరద రావడంతో కొద్ది రోజుల్లోనే సాగర్ నిండింది. నిండిన తర్వాత సైతం వరదలు తగ్గకపోవడంతో సముద్రంలోకి భారీగా నీరు విడుదల చేశారు. అక్టోబరులోనూ వరదలు రావడంతో జలాశయాలు నిండుకుండల్లా ఉండటం, ప్రస్తుత వానాకాలం పూర్తయినా నీటి నిల్వలు తగ్గకపోవడంతో వచ్చే వానాకాలం సాగుపై పూర్తి విశ్వాసం నెలకొంది. నీటిని ఇలాగే ఉంచితే వచ్చే ఏడాది ముందస్తుగానే విడుదల చేపట్టి నాట్లు, వెదజల్లుడు పూర్తి చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు.

సాగర్ జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 587 అడుగుల మేర నీరు ఉంది. అంటే 305 టీఎంసీలు. శ్రీశైలం జలాశయంలోనూ 885 అడుగులకు గాను 866 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా కొంత నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీన్ని నిలువరించితే చాలా వరకు జలాశయంలో నీటి నిల్వలు తగ్గవు.

**అక్టోబరులోనూ వరదలు..**

సాధారణంగా నైరుతి రుతుపవనాలు ఉద్ధృతంగా వ్యాపించిన సమయంలో అంటే ఆగస్టు, సెప్టెంబర్లలో కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు పడి వరదలు వస్తాయి. అదే వరదతో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుతాయి. ఆ తర్వాత వరదలు వచ్చినా సాగు, తాగునీటి అవసరాలకు పోగా మిగులు నామమాత్రం




గానే ఉంటుంది. సాగర్ జలాశయానికి అక్టోబరులో వచ్చిన వరదను బట్టి సాగర్ కుడి, ఎడమ కాల్వలతో పాటు విద్యుదుత్పత్తి, తాగునీటి అవసరాలకు పోగా సముద్రంలోకి నీటిని వదిలారు. అంటే కేవలం నవంబరు నెలలోనే నిల్వ నీటిని వాడుకున్నారు.

**పొదుపుగా వాడుకుంటే..** ప్రస్తుతం నీటి నిల్వలు రెండు సీజన్‌లకు సరిపోతాయని అధికారులు సైతం పేర్కొంటున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవడంతో పాటు రాజకీయలకు అతీతంగా విద్యుదుత్పత్తి, కుడి కాల్వకు కేటాయింపులు, ఎడమ కాల్వకు నీటి విడుదల.. అన్నింటిని క్రమపద్ధతిలో నిర్వహిస్తే జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్త పడవచ్చునని సూచిస్తున్నారు. సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో 95 శాతం వరి సాగు చేపడుతున్నందున వచ్చే వానాకాలం సమయానికి వర్షాలు లేకపోయినా సకాలంలో నీరు విడుదల చేసుకోవచ్చని రైతులు చెబుతున్నారు. యాసంగి అవసరాలకు పోగా వానాకాలం నాటికి 560 అడుగుల మేర నీరున్నా ఒక పంటకు ఢోకా ఉండదని, ఈలోగా నైరుతి రుతుపవనాలు విస్తరించి వర్షాలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# దిగువకు ధరలు.. రైతన్న దిగాలు

సిద్దిపేట : అకాల వానలతో ఓ పంట.. సకాలంలో కురవక మరో పంట.. మద్దతు ధర తగినంత లేక ఇంకో పంట.. ఇలా ఆరుగాలం కష్టపడి జనానికి ఆహారాన్నందించే రైతన్న ఏదోఒక విధంగా నష్టం చూస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు తగ్గిపోయి పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి కనిపించక కర్షకులు ఆందోళన చెందుతున్నారు. నవంబరు 31 వరకు ఓ మోస్తరు ఉన్న కూరగాయల ధరలు డిసెంబరులో తగ్గుముఖం పట్టాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాలతో పాటు కొన్ని మండలాల్లో కూరగాయలను పండిస్తారు. మండల కేంద్రాల్లో రైతులు పండించిన కూరగాయలను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. పలువురు రైతులు స్థానిక మార్కెట్‌లలో విక్రయిస్తున్నారు. మరికొందరు హైదరాబాద్, ఇతర నగరాలకు తరలిస్తున్నారు. 13 రోజుల నుంచి పరిశీలిస్తే టమాటా, బెండ, కాకర,



వంకాయ ధరలు ఎక్కువగా పడిపోయాయి. వాటి సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం రావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.6కే 15 కిలోలు..** ప్రస్తుతం పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉన్న సమయంలోనూ సాధారణంగా వంకాయకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. అందుకు భిన్నంగా వంకాయ ధరలు అమాంతం పడిపోయాయి. జిల్లాలో రైతులు వంద ఎకరాల్లో వంకాయ తోటలను సాగు చేశారు. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుండటంతో అన్ని మార్కెట్‌లలో వంకాయ లభిస్తోంది. రెండు రోజులుగా బహిరంగ మార్కెట్లో వంకాయ రూ.6కే 15 కిలోల వరకు రైతులు వినియోగదారులకు విక్రయించారు. చేనులో వంకాయ కోసి, రవాణా చేసేందుకు అయ్యే ఖర్చు కంటే అమ్మకంతో తక్కువగా వస్తుండటంతో కొందరు రైతులు మొక్కలపైనే కాయలను వదిలేస్తున్నారు. అద్దెకర పొలంలో రూ.30 వేలు ఖర్చు చేసి సాగు చేసిన వంకాయ తోటను ధర లేక వదిలి పెట్టానని చిన్నకోడూరు రైతు మల్లేశం తెలిపారు.

**తగ్గడానికి కొన్ని కారణాలు**

దిగుబడి పెరిగింది.

పొరుగు రాష్ట్రాల నుంచి రాక

చిన్న కమతాల్లోనే ఎక్కువ మంది రైతులు వేయడంతో విస్తీర్ణం పెరిగింది.ః టమాటలాంటివి త్వరగా కుళ్లిపోతాయని త్వరగా అమ్మకం మొక్కజొన్న కోతలు, యాసంగి సీజన్ ప్రారంభం మధ్య ఉన్న కొద్ది రోజుల్లోనే కాయగూరలను పండించి ఎంతోకొంతకు అమ్మేయాలనే ఆలోచనతో తగ్గాయి.

పెట్టుబడి రాలేదు– మిద్దెల రమేశ్, చంద్లాపూర్

మాది చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామం. గత 15 ఏళ్లుగా 20 గుంటల విస్తీర్ణంలో బెండ తోట సాగు చేస్తున్నా. ప్రస్తుతం 20 గుంటల్లో చేశా. విత్తనం మొదలు ఇప్పటి వరకు రూ.15 వేలు పెట్టుబడి ఖర్చు అయింది. రెండు సార్లు మాత్రమే బెండకాయలు కోశా. కూలీలకు సైతం డబ్బులు రావడం లేదు. సరైన ధర లేక పోవడంతో పంటను మొక్కలపైనే వదిలేశా. పదిహేనేళ్లలో ఇంత తక్కువ ధర ఎప్పుడూ రాలేదు.

# నిఘా నేత్రం.. నిర్వహణ భారం

హైదరాబాద్: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో ఎంతో కీలకమైన సీసీ కెమెరాల నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోంది. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా పోలీసులు కాలనీ సంఘాల్ని చైతన్యపరచి రాజధానిలో లక్షలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. వాటి నిర్వహణ, మరమ్మతుల విషయంలో అదే స్థాయిలో దృష్టి సారించకపోవడం సమస్యగా మారుతోంది. ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదో గుర్తించి స్థానిక కాలనీ సంఘాలతో మాట్లాడి సరి చేయించాల్సి ఉన్నా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. మరమ్మతు కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో కాలనీ సంక్షేమ సంఘాలు వెంటనే చేయించడం లేదు. ఫలితంగా నేరాలు జరిగినప్పుడు నిందితుల్ని గుర్తించడం, ఆధారాలు సేకరించడంలో పోలీసులకు ఇబ్బంది ఎదురవుతోంది.

రాజధానిలో మూడు కమిషనరేట్ల పరిధిలోని కాలనీ సంఘాలు, గేటెడ్



కమ్యూనిటీలు, సంస్థలు, వ్యాపార సముదాయాలతో పోలీసులు లక్షల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు.

**ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి**

డాక్టర్ ఎం జగన్‌మోహన్‌రావు, మెడికల్ అండ్ హెల్త్ కాలనీ సంఘం జనరల్ సెక్రెటరీ, బీఎన్‌రెడ్డినగర్

రోడ్లు, వీధి దీపాల తరహాలోనే ప్రభుత్వం సీసీ కెమెరాలను నిర్వహణపై కూడా దృష్టిసారిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దీనివల్ల నేరాల తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. భద్రతాపరంగా ఎంతో కీలకమైన ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారించాలి.

# తియ్యగా తినేస్తోంది..!

మిర్యాలగూడ : 'దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మధుమేహ రోగుల సంఖ్యలో మూడోస్థానంలో ఉంది.. తెలంగాణలో 1.75 కోట్ల మందికి పరీక్షలు చేస్తే 24.52 లక్షల మందికి మధుమేహం నిర్ధారణ అయింది.. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ఇటీవల పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక సారాంశం ఇది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేకంగా అసంక్రమిత వ్యాధుల విభాగాన్ని ఏర్పాటు చేసి 30 ఏళ్లు పైబడిన వారికి చేస్తున్న పరీక్షల్లో మధుమేహ కేసుల సంఖ్య పెరిగిపోతున్న తీరు ఆందోళన కలిగిస్తుంది. పట్టణ జనాభా పెరిగిపోవటం, ఆహారపు అలవాట్లు మారిపోవడం, శారీరక వ్యాయామం లేకపోవటం ప్రధాన కారణాలుగా గుర్తిస్తున్నారు. మూడు పదులు దాటిన వారిలో వైద్య పరీక్షలు చేస్తే మధుమేహం నిర్ధారణ అవుతుండగా వారికి ప్రభుత్వం ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నారు.

**జీవన శైలి కారణంగానే..**

అలుగుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి ఎండీ

మూడు పూటలా అన్నం, పిండి పదార్థాలు ఉండే అల్పాహారం, శారీరక శ్రమలేక, కూర్చుని చేసే ఉద్యోగాలు ప్రధాన కారణం. కాగా మందుల వాడకంతో పాటుగా ఆహారపు అలవాట్లలో మార్పులతో మధుమేహం నియంత్రించవచ్చు. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తగ్గించటంతో పాటు తృణధాన్యాలు అధికంగా తీసుకోవాలి. కార్యాలయాల్లో పనిచేసే వారు ఎక్కువ సమయం కూర్చొకుండా కనీసం అరగంటకు ఒకసారి లేచి అటూ ఇటూ తిరగాలి. నిత్యం వ్యాయామం, వారంలో మూడు రోజులైనా నడవాలి. కనీసం ఎనిమిది గంటల అంతరాయం లేని నిద్ర అవసరం. బరువు తగ్గాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మధుమేహాన్ని పూర్తిగా నయం చేసే ప్రయోగాలు జరుగుతున్నాయి. సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇన్సులిన్ మాత్రలు వంటి ప్రయోగాలు చేస్తున్నారు.

# ప్రతిభ చాటేలా.. ఫలితాల్లో మెరిసేలా

మునగాల : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మెరిసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రెండేళ్ల కిందట కేజీబీవీల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించారు. తెలుగు నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మారిన వారికి ఇబ్బందులు తలెత్తాయి. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. సర్కారు బడుల్లో మాదిరిగానే నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**పఠనానికి ప్రాధాన్యం..**

కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రతి తరగతిలో మొదటి 10 నుంచి 15 నిమిషాల సమయాన్ని పఠనానికి కేటాయించేలా ప్రణాళిక నిర్దేశించారు. ఇందుకు సబ్జెక్టుకు ఒక సీఆర్టీ ఇన్‌ఛార్జిని నియమించారు. నిత్యం చదవాల్సిన అంశాన్ని విద్యార్థినులకు వీరు సమాచారం అందిస్తారు. సంబంధిత అంశం పూర్తయ్యాక రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ఆయా సబ్జెక్టుల ఇన్‌ఛార్జులు నిత్యం వాటిలోని ఉత్తమ పఠనాన్ని ఎంపిక చేస్తారు. ఫలితంగా విద్యార్థుల్లో పోటీ పెరగడంతోపాటు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చుననే ధీమాతో విద్యాశాఖ అధికారులు ఉన్నారు. ఇదే విధానాన్ని పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్నారు.

**బృందాల విభజన..**

సామర్థ్యాలు పెంపొందించడానికి విద్యార్థులను మెరిట్, మధ్యస్థం, తక్కువగా చదివేవారు.. ఇలా మూడు భాగాలుగా విభజించారు. అందరూ మొదటి స్థాయికి వచ్చేలా వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పఠనా సామర్థ్యాలతో విద్యార్థుల మధ్య పోటీతత్వం పెంపొందిస్తూ, ప్రతి అంశాన్ని సులువుగా ఎలా అర్థం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు. ఇలా రీడింగ్ ఛాలెంజ్ కార్యక్రమం అమలు ద్వారా సత్ఫలితాలు సాధిస్తామని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా వెనుకబడిన విద్యార్థులకు మేలు జరుగుతుందని, అన్ని అంశాల్లో పట్టు సాధించేలా అవగాహన పెంపొందిస్తున్నామని జీసీడీవో పూలన్ తెలిపారు.

# ఆట మైదానాలకు.. టెం'డర్'!



కరీంనగర్ : కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలోని స్కేటింగ్ కోర్టు ఇది. చిన్నారులు ఇక్కడకు వచ్చి స్కేటింగ్ నేర్చుకుంటుంటారు. సెలవు రోజుల్లో ఎక్కువ మంది వస్తుంటారు. మున్ముందు పిల్లలు ఇక్కడ స్కేటింగ్ చేయాలంటే డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి. ఆదాయ వనరుల కోసం అధికారులు ఈ స్టేడియాన్ని ప్రైవేటు వారికి అప్పగించాలనే నిర్ణయం దీనికి బలం చేకూరుస్తుంది.

చిన్నారులు, యువత ఆరోగ్యం ఎక్కడో లేదు.. వారు ఆడుకునే మైదానంలో దాగి ఉందని' స్వామి వివేకానంద చెప్పిన మాటలు కరీంనగర్‌లో చెల్లుబాటు అయ్యేలా లేవు. యువజన క్రీడా శాఖ అధికారుల నిర్వాకంతో ఇకమీదట ఇక్కడ ఆడే కొన్ని ఆటలకు పైసలు కట్టాలి. ఆదాయమే పరమావధిగా ఇక్కడి అధికారుల నిర్ణయం క్రీడాకారులకు శాపంగా మారబోతోంది. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన స్థలాలు ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి లీజు రూపంలో వెళ్ల బోతున్నాయి. బ్యాడ్మింటన్, స్కేటింగ్ క్రీడాస్థలాలను అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు బిడ్ టెండర్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. రెండేళ్లపాటు ఈ మైదానాలను లీజుకు ఇచ్చేందుకు నిబంధనలను రూపొందించారు. స్కేటింగ్ రింగ్‌కు నెలకు రూ.50 వేల కిరాయితోపాటు రూ.1.50 లక్షల ధరావత్తు చెల్లించాలి. బ్యాడ్మింటన్ కోర్టుకు నెలకు రూ.1.50 లక్షల అద్దెతోపాటు రూ.5 లక్షలు ముందస్తుగా అందించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి, కరీంనగర్ పేరిట ప్రకటన వెలువర్చారు. క్రీడాభిమానులతోపాటు పలువురు వ్యాయమోపాధ్యాయులు ఈ నిర్ణయంపై విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**మరింత "ప్రియం..**

కరోనా తరువాత కరీంనగర్‌లో క్రీడా పోటీల నిర్వహణ అనేది గగనమవుతోంది. పైగా సాధన చేసేందుకు ఉన్న అరకొర మైదానాలు ఇలా లీజులతో దూరమవడంతో సామాన్య క్రీడాకారుడికి ఆట అంటే ఖరీదైన వ్యవహారంగానే మారే అవకాశముంది. టెండర్ ద్వారా మైదానాన్ని దక్కించుకున్న వారు అద్దె చెల్లించాలనే ఉద్దేశంతోనే ఉంటారు. ఇక్కడ ఆటలాడే వారి నుంచి ఫీజు వసూలు చేస్తారు. ఇండోర్ స్టేడియంలో ఉన్న బ్యాడ్మింటన్ ఆడాలంటే నెలకున్న అద్దె ప్రకారం రోజుకు రూ.5 వేలు వసూలు చేయాలి. ఇంత మొత్తాన్ని చెల్లించి ఏ కోచ్ ముందుకొస్తాడు..? ఏ క్రీడాకారులు ఇక్కడ ఆటలాడుతారనేది అంతుచిక్కన్ని ప్రశ్నగానే మారింది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి మైదానాలు వెళ్లడంతో పేద విద్యార్థులకు ఆట కలగానే మిగిలిపోనుంది.

**ఆదాయమే ముఖ్యమా..**

అంబేద్కర్ మైదానం నిర్వహణకు ఆదాయాన్ని సమకూర్చాలనే ఉద్దేశంతోనే ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారనేది అర్థమవుతోంది. వాస్తవానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులను పక్కాగా వినియోగించుకుంటే ఈ లీజు కథ ముందుకొచ్చేది కాదు. ఈత కొలను నిర్వహణ ద్వారా ఆదాయం సమకూరుతుంది. దాని ద్వారా వచ్చిన ఆదాయాన్ని పక్కాగా వినియోగించుకోవడంపైన దృష్టి సారించకుండా కొత్త దారులను వెతకడం హాస్యస్పదంగానే అనిపిస్తోంది. మరో వైపు గతంలో ఈత కొలను ద్వారా వచ్చే ఆదాయం పైసలు పక్కదారి పట్టిన ఉదంతాలున్నాయి. వాటిని చక్కదిద్దడం పక్కనబెట్టి కొత్తదారులను అన్వేషించడానికి కారణమేంటనేది ఎవరికీ అర్థం కావడంలేదు. పైగా ఇటీవల రూ.7 కోట్లతో నిర్మించిన ఆధునిక సముదాయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇక్కడ దాదాపు 22 దుకాణ సముదాయాలతోపాటు అద్దెకు ఇచ్చే విధంగా గదులు, ఒక వేడుక ప్రాంగణం సిద్ధంగా ఉన్నాయి. ఏడాది కాలంగా ఇది ప్రారంభానికి నోచుకోలేదు. ఒకవేళ ఆదాయంపైనా దృష్టి ఉంటే ఈ అధికారులు ఈ సముదాయ భవనాన్ని త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటే బాగుండేదనే భావన క్రీడాభిమానులు, ప్రజల నుంచి వినిపిస్తోంది.

**అధికారులేమన్నారంటే..!** టెండర్ పిలిచిన మాట వాస్తవమేనని.. ఆదాయం రావడంతోపాటు ఆటలకు ప్రాధాన్యముంటుందని జిల్లా కలెక్టరు పమేలా సత్పతి అన్నారు. కొన్నాళ్లుగా వృథాగా ఉండటంతో అధికారులంతా సమష్టిగా చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని.. దీని ద్వారా క్రీడల అభివృద్ధికి సహకారం అందుతుందన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ.. నిర్వహణ నిధులు సమకూర్చేందుకే ఈ నిర్ణయాన్ని తీసుకున్నా మని.. తాము ఏది చేసినా జిల్లా కలెక్టరు ఆదేశాలతో చేస్తున్నామని చెప్పారు.

# పేదలకు సొంతింటి యోగం!



పరిగి : పేదల సొంతింటి కల సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రెండు నెలల కిందటే గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది. తాజాగా మరో అడుగు ముందుకు వేసి, ప్రత్యేక యాప్ రూపొందించడంతో వివరాల సేకరణ ప్రారంభమైంది. గృహ నిర్మాణశాఖలో విధులు నిర్వహించి, ఇతర శాఖల్లోకి బదిలీ అయిన వారిని మళ్లీ అదే శాఖకు పంపుతున్నారు.

**2.57లక్షల దరఖాస్తులు**

ప్రజాపాలనలో భాగంగా గత డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరించారు. పది అంశాలకు కలిపి మొత్తంగా 13,24,270 అర్జీలు అందాయి. వాటిలో ప్రధానంగా గృహాలు మంజూరు చేయాలని కోరుతూ 2,57,664 వచ్చాయి. వీటినే ప్రామాణికంగా తీసుకున్న అధికారులు సర్వే బాట పట్టారు. పంచాయతీల్లో గ్రామ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులతో పాటు ఇతర సిబ్బంది కూడా దరఖాస్తుల పరిశీలన విధుల్లో పాల్గొంటున్నారు.

**తొలి విడతలో 3,500..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 చొప్పున ఇవ్వాలని యోచిస్తున్నట్లు ఎమ్మెల్యేలు చెబుతున్నారు. ఈ లెక్కన జిల్లాలో పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలుండగా 14 వేల ఇళ్లను చేపట్టనున్నారు.

**వీరికే ప్రాధాన్యం..**

ఇళ్ల మంజూరు విషయంలో ఒంటరి మహిళలతో పాటు ఆహారభద్రత కార్డు కలిగిన వారు, దివ్యాంగులు, అద్దె ఇళ్లలో నివాసం ఉండేవారిని ఎంపిక చేయనున్నారు. ఆ తరువాత ఇతరులకు అవకాశం దక్కనుంది.

**గృహనిర్మాణ శాఖ బలోపేతం..** ఇందిరమ్మ ఇళ్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయని భావించిన కేసీఆర్ సర్కారు చివరకు ఆ శాఖనే రద్దు చేసి అందులో పనిచేస్తున్న అధికారులను ఇతర శాఖల్లోకి పంపారు. అంతేగాకుండా ఇళ్ల మంజూరు కూడా చేపట్టకపోవడంతో పేదలు నిరాశకు లోనయ్యారు. మళ్లీ రేవంత్ ప్రభుత్వం తిరిగి తీసుకోనుండడంతో గృహ నిర్మాణ శాఖ పునరుత్తేజం కానుంది. ఒక్కో ఇంటి నిర్మాణ పనులకు నాలుగు విడతల్లో రూ.5లక్షల నగదు సాయం అందించనుంది. **నెలాఖరు వరకు పరిశీలన పూర్తి..** జిల్లాలోని 566 పంచాయతీల్లో సర్వే జరుగుతోంది. ఇప్పటికే రెండు విడతలుగా, యాప్‌లో నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వం విడతల వారీగా జిల్లాకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనుంది. లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్.

# అదనం లేకపోయినా జాప్యమే

హైదరాబాద్: అనుమతులకు అదనంగా అంతస్తులను నిర్మించాలనుకున్నా.. నిధులు లేక, సాంకేతిక అనుమతులు రాకపోవడంతో తొలిదశలోని ఉత్తర్వులనే ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడానికి నిర్ణయం తీసుకొంది. దీంతో సనత్‌నగర్, చైతన్యపురిలోని భవనాల అంతస్తులు కుదించక తప్పడం లేదు. పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల అంతస్తుల సంఖ్య తగ్గింది. నాలుగింటిలో రెండు ఆస్పత్రుల అంతస్తులను ప్రభుత్వం తగ్గించింది. మిగిలిన రెండు యథావిధిగా నిర్మిస్తోంది.

**ఇక్కడ నిర్మాణం:** సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, చైతన్యపురిలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతోపాటు నిమ్స్ విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మూడు నూతన ఆస్పత్రుల నిర్మాణానికి రూ.2,697 కోట్లు, నిమ్స్ విస్తరణకు రూ.1,698 కోట్లు వ్యయం అవుతుందని అంచనా.

**ఇదీ లక్ష్యం:** వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సనత్‌నగర్, అల్వాల్, చైతన్యపురి ఆస్పత్రుల నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అనుమతులతోపాటు వివిధ కారణాలతో సుమారు ఆరు నుంచి ఏడు నెలలు జాప్యమవుతోంది.

చైతన్యపురిలో నిర్మిస్తున్న గ్రౌండ్(జి)+13 అంతస్తులకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత జి+13 అంతస్తులకే అనుమతి లభించింది. ఆ తర్వాత 24 అంతస్తులకు పెంచాలని నిర్ణయించింది. నిధుల సమస్యతో తాజాగా మళ్లీ జి+13 అంతస్తులకే పరిమితం చేయాలనుకుంటున్నారు.



సనత్‌నగర్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని జి+5 అంతస్తులకు పరిమితం చేశారు. గతంలో జి+6గా నిర్మించాలని నిర్ణయించారు. ఆ ప్రాంతం బేగంపేట విమానాశ్రయానికి సమీపంలో ఉండటంతో ఎయిర్ పోర్ట్ అథారిటీ అనుమతి ఇవ్వడానికి నిరాకరించింది. భారీగా చేపట్టిన నిమ్స్ ఆస్పత్రి విస్తరణ పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. మిగిలిన మూడింటితో పోలిస్తే నిమ్స్ నిర్మాణాలు 2027 జూన్ నాటికి పూర్తి చేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలిచ్చారు.

# ఆలయాల సమాచారం.. అంతర్జాలంలో నిక్షిప్తం

కరీంనగర్ : దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల పూర్తి సమాచారం అంతర్జాలంలో నిక్షిప్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా ఆలయాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుళ్లను సులభంగా గుర్తించేలా వాటి పరిధిలోని భూములు, ఆస్తుల వివరాలు తక్షణమే తెలిసేలా చేస్తున్నారు. ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా ఆధునిక సాంకేతికను వినియోగించుకుంటున్నారు. అన్ని రకాల దేవాలయాల సమాచారాన్ని జీపీఎస్(గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం)తో అనుసంధాన ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. సమాచారం గూగుల్ మ్యాప్స్‌లో పొందేలా త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ విధానంతో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా అడ్డుకట్ట పడనుంది.

**అన్నింటికి జియో ట్యాగింగ్**

దేవాలయం ఎక్కడ ఉంది? దాని సరిహద్దులు ఏమిటి? దాని పరిధిలోని భూములు ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఇలా ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం ప్రజలకు తెలిసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారం పొందుపరుస్తున్నారు.

దేవాదాయ శాఖ పరిధిలో పబ్లికేషన్, రిజిస్టర్ అయి ఉన్న దేవాలయాలు, ధూపదీప నివేదన పథకంతోపాటు అన్ని రకాల ఆలయాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు.

గూగుల్ మ్యాప్స్‌లో ఏ ఆలయానికి సంబంధించిన సమాచారం



కావాలనుకుంటే టైప్ చేస్తే చాలు.. పూర్తి సమాచారం అందుబాటులోకి వస్తుంది. భూములు, ఆస్తుల వివరాలను సైతం ఫొటోల ద్వారా సేకరించి ప్రభుత్వ ధరణి వెబ్‌సైట్ నుంచి జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) ద్వారా పరిశీలించి ఆయా భూముల సరిహద్దులను మార్కింగ్ చేస్తున్నారు. జియో ట్యాగింగ్‌లో జీపీఎస్ ద్వారా ఫిక్స్ చేస్తున్నారు. భవిష్యత్తులో మొబైల్ యాప్‌ను రూపొందించేందుకు దేవాదాయ శాఖ కసరత్తు చేస్తోంది.

ఈవోలు, సిబ్బందితో జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్‌లో ఫొటోలను తీయించి అక్షాంశాలు, రేఖాంశాలు, ప్రాంతం (లోకేషన్) ఆధారంగా సమాచారాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. అక్కడ జియో ట్యాగింగ్‌తో ఆలయాలకు సంబంధించిన కోఆర్డినేట్ చేసి నిర్ధారిస్తారు.

**అన్యాక్రాంతం కాకుండా..**

ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భవిష్యత్తులో ఏదైన ఆలయ భూమి కబ్జాకు గురైతే తెలుసుకోవచ్చు. గూగుల్ మ్యాప్‌లో సర్చ్ చేస్తే చాలు అక్షాంశాలు, రేఖాంశాలతో మనకు ఆ ప్రదేశం చూపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని దేవాలయాల సమాచారం పక్కగా తెలిసేలా జియో ట్యాగింగ్ చేస్తున్నాం. దేవాలయ భూములు, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు ఇది దోహదపడుతుంది. – సుప్రియ, సహాయ కమిషనర్, దేవాదాయశాఖ ఉమ్మడి కరీంనగర్ జిల్లా

# ప్రగతి చక్రం.. పల్లెకు దూరం

కొడిమ్యాల: ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో తమ గ్రామాలకు బస్సు సదుపాయం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రభుత్వం తారు రోడ్లు, బస్సు షెల్టర్లు నిర్మిస్తున్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. కొడిమ్యాల మండలం నమిలికొండ మీదుగా శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లి, నల్లగొండ వరకు తారురోడ్డు ఉన్నప్పటికీ చాలా ఏళ్లుగా బస్సు సదుపాయం లేకపోవడంతో ముఖ్యంగా రాత్రి సమయంలో ప్రయాణికులు ఇబ్బందులకు గురువుతున్నారు. బస్సు సదుపాయం కల్పిస్తే కరీంనగర్, జగిత్యాలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. గతంలో జగిత్యాల నుంచి మల్యాల, బల్వంతాపూర్, సర్వాపూర్, నర్సింహులపల్లె, గౌరాపూర్ మీదుగా పూడూర్ వరకు బస్సు సదుపాయం ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో ఆ గ్రామాల ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దమ్మయ్యపేట, బోల్లోనిచెరువు, చింతలపల్లి గ్రామాలకు నేటికీ బస్సు



సౌకర్యంలేదు. జగిత్యాల నుంచి కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల నల్లగొండ మీదుగా సికింద్రాబాద్ వరకు బస్సు సదుపాయం ఉండగా కొన్నేళ్ల క్రితం ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు.

**పునరుద్ధరించాలి..**

గతంలో జగిత్యాల నుంచి వయా కొడిమ్యాల, రామకిష్టాపూర్, చెప్యాల, వేములవాడ మీదుగా సికింద్రాబాద్ వరకు పల్లెవెలుగు బస్సు సదుపాయం ఉండేది. దీంతో గ్రామస్థులు, ముఖ్యంగా మహిళలకు సౌకర్యంగా ఉండేది. కొన్నేళ్లుగా బస్సును నిలిపివేయడంతో గ్రామస్థులు ఎటువెళ్లాలన్నా ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సును పునరుద్ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.

– దయ్యాల రవి, రామకిష్టాపూర్

**ప్రైవేటు వాహనాలే దిక్కు..**

నమిలికొండ గ్రామం నుంచి శ్రీరాములపల్లె, తిప్పాయిపల్లె గ్రామాలకు తారురోడ్డు ఉన్నప్పటికీ బస్సు సదుపాయం లేకపోవడంతో ఆయా గ్రామస్థులు ఏళ్లుగా ప్రైవేటు వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందున గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సు సదుపాయం కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇరుమల్ల రమేష్, నమిలికొండ




# సంధ్య థియేటర్.. లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?

హైదరాబాద్: ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 4న రాత్రి పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘటనపై లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేశారు.

దీనిపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. థియేటర్‌కు ఇరువైపులా రెస్టారంట్‌లు ఉన్నాయని, నటులొస్తే భద్రత కల్పించలేమని చిక్కడపల్లి పోలీసులు ముందుగానే హెచ్చరించినట్టు ఓ రిపోర్టు సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే వైరల్ అయింది. సంధ్య 70ఎంఎం, 35ఎంఎం రెండు థియేటర్లు ఒకేచోట ఉండగా, వీటిలో దాదాపు 2,520 సీటింగ్ కెపాసిటీ ఉంది. మహిళలు థియేటర్‌లోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా ఎంట్రీ, డిస్‌ప్లే బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రేక్షకులు థియేటర్‌లోకి వెళ్లేందుకు ఒకటే మార్గం ఉంది. ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చే విధంగా ప్రోత్సహిస్తోన్న యాజమాన్యం .. రద్దీని నియంత్రిచేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందడం, బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించారు.

ఈ కేసులో ఇప్పటికే అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. తాజాగా సంధ్య థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు.



# రాష్ట్రపతికి స్వాగతం పలికిన సీఎం రేవంత్

హైదరాబాద్ : శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు వచ్చారు. మంగళవారం హకీంపేట్ విమానాశ్రయంలో ఆమెకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా భారీ కాన్వాయ్‌తో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్లనున్నారు.

తొలుత ఏపీలో ఇవాళ జరిగిన ఎయిమ్స్ స్నాతకోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో సుమారు 49 ఎంబీబీఎస్ విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం ఏపీలోని గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో హకీంపేటకు వచ్చారు. రాష్ట్రపతిని ఆహ్వానించిన వారిలో ముఖ్యమంత్రి, గవర్నర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రులు, అధికారులు ఉన్నారు. ఈరోజు నుంచి ఈ నెల 21 వరకు సికింద్రబాద్‌లోని బొల్లారంలో ద్రౌపది ముర్ము ఉండనున్నారు.

ఈనెల 18న రాష్ట్రపతి నిలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో ఎట్ హోం కార్యక్రమం నిర్వహించనున్నారు.

# హరీశ్‌రావు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: శాసనసభను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. స్పీకర్ అనుమతితో అప్పులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు, భట్టి విక్రమార్క మధ్య వాదన కొనసాగింది.

**ఏడాదిలోనే రూ. 1.27లక్షల కోట్ల అప్పు: హరీశ్‌రావు...** తొలుత భారాస సభ్యుడు హరీశ్‌రావు మాట్లాడుతూ ఆర్‌బీఐ వివరాల ప్రకారం.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రూ. 1.27లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. ఐదేళ్ల పాలన పూర్తయ్యే సరికి ఈ ప్రభుత్వం చేసిన అప్పు రూ. 6.36లక్షల కోట్లకు చేరుతుందన్నారు. భారాస హయాంలో చేసిన అప్పులపై కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారాలు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 4,17,496 కోట్ల అప్పు చేస్తే.. రూ. 7లక్షల కోట్ల పైచిలుకు అంటూ గోబెల్స్ ప్రచారం చేశారన్నారు. దీనిపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్లు తెలిపారు. అప్పుల అంశంపై సభలో ప్రత్యేక చర్చ చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చడం తమకు సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని.. ఇప్పుడు అప్పుల పేరు చెప్పి తప్పించుకుంటున్నారని విమర్శించారు.

**చర్చకు మేం సిద్ధమే: భట్టి..** అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రజలకు వాస్తవాలు తెలియాలనే సభలో శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి అప్పులు చేయడం లేదని చెప్పారు. స్పీకర్ అనుమతితో ఈ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో హరీశ్‌రావుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "సత్యదూరమైన మాటలతో ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయొద్దు. సభను తప్పుదోవ పట్టించొద్దు. గత ప్రభుత్వ లోపాలను ప్రజలకు తెలియజెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. భారాస హయాంలో దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారా? తీసుకునే అప్పుల విషయంలో మేం దాచుకోకుండా చెప్పాం. మీరు మాత్రం అప్పట్లో దాచిపెట్టారు" అని విమర్శించారు. మాకే నీతులెందుకు చెబుతున్నారంటూ స్పీకర్‌ను ఉద్దేశించి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై భట్టి అభ్యంతరం తెలిపారు. సభాపతిని శాసించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. "బీఏసీ సమావేశంలో హరీశ్‌రావు లేచి కాగితాలు పడేసి బయటకు వెళ్లారు. భారాస హయాంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పీకర్‌గా ఉన్నప్పుడు ఏ నిబంధనలు పాటించారో ఇప్పుడూ అవే పాటించాలి కదా! సభ ఎన్నిరోజులు నిర్వహించాలనే దానిపై సభాపతి నిర్ణయం తీసుకుంటారని భారాస హయాంలో మాకు చెప్పారు. ఇప్పుడు ఎందుకు దాన్ని పాటించరు? సభాపతి స్థానాన్ని అందరూ గౌరవించాలి.. నియమాల ప్రకారం నడుచుకోవాలి" అని భట్టి అన్నారు. అనంతరం హరీశ్‌రావు స్పందిస్తూ రూల్స్ బుక్ ఆధారంగానే తాను మాట్లాడినట్లు చెప్పారు. సభను తప్పుదోవ పట్టించేందుకే భట్టి విమర్శలు చేశారన్నారు. అప్పులపై ఈ సమావేశాల్లోనే చర్చకు అనుమతించాలని స్పీకర్‌ను కోరారు.




# హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమన్నారు. "గతంలో పర్మిషన్ తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల వైపు వెళ్లం. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటి కూల్చివేతలు తప్పదు. కొత్తగా తీసుకున్న అనుమతులను హైడ్రా పరిశీలిస్తుంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు పనిచేస్తున్నాం. పేదల జోలికి హైడ్రా రాదు. వారి ఇళ్లను కూల్చివేస్తున్నామనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు" అని రంగనాథ్ కోరారు.

# సీఎం రేవంత్‌కు జ్ఞానోదయం కల్పించాలి.. అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ వినతి పత్రాలు..




హైదరాబాద్: లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించినందుకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు అన్ని నియోజకవర్గాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అణచివేత వైఖరిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను సీఎం రేవంత్ రెడ్డి కాలరాశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కల్పించాలన్నారు. లగచర్ల గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి ముఖ్యమంత్రి విలాసవంతమైన టూర్లలో పాల్గొంటున్నారని విమర్శించారు. గిరిజన రైతులకు బెయిల్ రాకుండా కోర్టులో అడ్డుకుంటున్నారని, ఛాతీనొప్పి వచ్చినా చేతులకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లే పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేవరకు బీఆర్ఎస్ నాయకులు వెంటపడి నిలదీస్తామన్నారు.

# లగచర్లకు రైతులకు సంఘీభావంగా.. నల్ల అంగీలు, చేతులకు బేడీలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన



హైదరాబాద్: లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే వినూత్న పద్ధతిలో నిరసన తెలిపారు. నల్ల రంగు అంగీలు, చేతులకు బేడీలు వేసుకుని ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదేమి రాజ్యం.. ఖాకీ రాజ్యం.. దోపిడి రాజ్యం, లాఠీ రాజ్యం.. లూఠీ రాజ్యం, రైతులకు సంకెళ్లా సిగ్గు సిగ్గు అంటూ అసెంబ్లీ లాబీల్లో నినాదాలు చేశారు. లగచర్ల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శాసనమండలి సభ్యులు కూడా మండలిలో నల్లరంగు దుస్తులు ధరించి నిరసన తెలిపారు. అంతకుముందు పరిశ్రమల పేరుతో బలవంతపు భూసేకరణ, రైతుల అరెస్టుపై బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ అంశాలపై సభలో చర్చించడానికి అనుమతించాలంటూ స్పీకర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ వాయిదా తీర్మానం అందజేశారు.

# ఉచిత విద్యుత్‌పై భట్టి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం : హరీశ్‌రావు



హైదరాబాద్ : ఉచిత విద్యుత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండించారు. శాసనసభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్‌కు రూ. 65 వేల కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించామని స్పష్టం చేశారు. కానీ భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ. 1,27,208 కోట్లు అప్పు చేసి కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. మా హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాం. మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని అందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తుల కల్పన చేసింది.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అప్పులు చేసి కమీషన్ల కోసం పంచుకుతిన్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అసలు తాము అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా భట్టి ఏదేదో మాట్లాడుతున్నారు. తమ హయాంలో వడ్లు కొన్నాం.. ఠంచన్‌గా పైసలు ఇచ్చాం. భట్టి విక్రమార్క వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# మనోజ్‌కు తల్లి షాక్.. పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో సంచనల విషయాలు..

మంచు మోహన్ బాబు కుటుంబంలో తలెత్తిన గొడవ రోజుకో మలుపు తీసుకుంటోంది. మొన్నటిదాకా మోహన్ బాబు, విష్ణు, మనోజ్.. పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా.. ఈ వివాదంపై తాజాగా మోహన్ బాబు భార్య నిర్మలా దేవి స్పందించారు. పహాడి షరీఫ్ పోలీసులకు ఆమె రాసిన లేఖలో షాకింగ్ విషయాలను ప్రస్తావించారు. దీంతో ప్రస్తుతం ఈ లేఖ టాలీవుడ్‌లో సంచలనం సృష్టిస్తోంది. అసలు ఆమె పోలీసులకు రాసిన లేఖలో ఏం ప్రస్తావించారో తెలుసుకుందాం.. మంచు నిర్మల మోహన్ బాబు పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్.. ఆమె మాటల్లోనే... "పహాడి షరీఫ్ పోలీస్ గారికి, నమస్కరించి వ్రాయునది ఏమనగా.. నేను అనగా, మంచు నిర్మలా మోహన్ బాబు, %ఔ/శీ%. మంచు మోహన్ బాబు, వయసు: 64 సం?లు, నివాసం: జల్పల్లిలోని మంచుటౌన్లో ఉంటున్నాను.. డిసెంబరు 14వ తేదీన నా పుట్టినరోజు సందర్భంగా నా పెద్ద కుమారుడు అయిన విష్ణు మంచు జల్పల్లి ఇంటికి వచ్చి కేకు తీసుకొచ్చి సెలబ్రేట్ చేశాడు. దీనికి నా చిన్న కుమారుడైన మనోజ్.. ఇంటికి వచ్చిన విష్ణు ఫుటేజ్ బయట పెట్టి, దాన్ని విష్ణు గొడవ చేసినట్టు లేనిపోని అభాండాలు వేసి పోలీస్ కంప్లయింట్ ఇచ్చినట్టు తెలిసింది. "..నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే, నా పుట్టినరోజు సందర్భంగా విష్ణు కేక్ తీసుకుని ఇంటికి వచ్చాడు. అలాగే తన రూములో ఉన్న సామాన్లు తీసుకున్నాడు. ఉన్న కొద్దిసేపు నాతోటి ఉండి కేక్ కట్ చేయించి సెలబ్రేట్ చేశాడు. నా చిన్న కొడుకైన మనోజ్‌కు ఈ ఇంట్లో ఎంత హక్కు ఉందో, అలాగే నా పెద్ద కొడుకు అయిన విష్ణుకి కూడా అంతే హక్కు ఉంది. నా పెద్ద కొడుకు అయిన విష్ణు దౌర్జన్యం చేయడం కానీ, మనుషులతో ఇంట్లోకి వచ్చి గొడవ చేయడం కానీ చేయలేదు.. "..మనోజ్ ఇచ్చిన కంప్లయింట్‌లో నిజం లేదు. ఈ ఇంట్లో పని చేస్తున్న వాళ్ళు కూడా 'మేమిక్కడ పని చేయలేమని'.. వాళ్ళే మానేశారు. ఇందులో విష్ణు ప్రమేయం ఎంత మాత్రం లేదు. విష్ణు మా జల్పల్లి ఇంటికి వచ్చాడు. నా పుట్టిన రోజు సెలబ్రేట్ చేశాడు. విష్ణు గదిలో ఉన్న తన సామాన్లు తీసుకుని వెళ్ళిపోయాడు.. అంతకు మించి ఇక్కడ జరిగింది ఏమీ లేదని మీకు తెలియజేయుచున్నాను..".. అంటూ మంచు నిర్మల మోహన్ బాబు పోలీసులకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660